క్లుప్తంగా

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



శంకరాపురంలో రైతులకు రుణాలు అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు రామారావు

నిడదవోలు రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అన్నారు. శంకరాపురం సొసైటీ పరిధిలోని 8 మంది రైతులకు రూ.20 లక్షల దీర్ఘకాలిక రుణాలను గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులకు సాగు రుణాలతో పాటు వ్యాపార, గేదెల కొనుగోలుకు రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి జాతర మహోత్సవాలు

నిడదవోలు రూరల్: కలవచర్ల గ్రామ దేవత శ్రీగోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు 21 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 21న అమ్మవారి పాన్పు, 22న గ్రామసేవ, 23న బలిచేట, 24న నైవేద్యాల సమర్పణ ఉంటాయన్నారు.

వైభవంగా సత్యదేవుని వ్రతాలు



తాళ్లపూడిలో సామూహిక సత్యదేవుని వ్రతాలు చేస్తున్న మహిళలు

తాళ్లపూడి: వైశాఖ మాసంలో అన్నవరం సత్యదేవుని కల్యాణం, వ్రతం నిర్వహించడం ఎంతో శుభ ఫలితాన్ని ఇస్తుందని టీటీడీ ధర్మ ప్రచారకుడు పరస రాధాకృష్ణ అన్నారు. స్థానిక పుష్కర ఘాట్ సమీపంలోని గంగా పార్వతీ సమేత గౌతమేశ్వర స్వామి, రమా సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని వ్రతాలు ఆచరించారు. అనంతరం దాతల సహకారంతో అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

చాగల్లు: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా చాగల్లులోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర పుష్పార్చనలో భాగంగా 1108 పుష్పాలతో అష్టోత్తర పూజ చేశారు. స్వామివారికి అభిషేకాలు, లక్ష నాగవల్లి దళార్చన, విశేష పుష్పాలంకరణ, నీరాజన మంత్ర పుష్పాలు, లక్ష తమలపాకులతో పూజ, పంచామృతాభిషేకం చేశారు. ఉమారామలింగేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



బిల్వదళాల నడుమ సోమేశ్వరస్వామివారు

నిడదవోలు: స్థానిక బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం మాసశివ రాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి అభిషేకాలు, లక్ష బిల్వార్చన పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకుడు శ్రీకాకులపు లక్ష్మీనరసింహశాస్త్రి, ఆలయ ఈఓ సోమాల శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు కల్యాణం తలంబ్రాలు

నల్లజర్ల: జగన్నాథపురంలోని శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి అధ్యక్షుడు ముళ్లపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో భద్రాచలం రాముని కల్యాణానికి గోటితో వలిచిన తలంబ్రాలు పంపారు. కల్యాణం తర్వాత తిరిగి భద్రాచలం నుంచి సీతారామ భజన మండలి సభ్యులకు గురువారం ఆ తలంబ్రాలను అందజేశారు. సమితి సభ్యులు వెదుళ్ల రామకృష్ణ, సవలం రామకృష్ణ, మద్దిపాటి రాంపండు, మైనం వెంకట బ్రహ్మయ్య, పాము శ్రీను తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు వీటిని అందించనున్నట్లు తెలిపారు.

శ్మశానవాటిక భూమి స్వాధీనం

గోపాలపురం: శ్మశానవాటికకు చెందిన ఆక్రమిత భూమిని రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం మండలం సాగిపాడు గ్రామంలో 3.96 సెంట్ల భూమి తనదంటూ ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు రెవెన్యూ అధికారులకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఆ భూమిని జేసీబీ సహాయంతో చదును చేసి శ్మశాన వాటిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రవీంద్రనాథ్ చెప్పారు. సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, మారాజు రాజేష్, డిప్యూటీ తహసీల్దార్ సాకే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- తుమ్మలగండి డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు
- అందుబాటులోకి వస్తే సుజలమే'



డ్యామ్ కొట్టుకుపోవడంతో నిరుపయోగంగా సుందరరామయ్య కాలువ

దేవరపల్లి: రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.. తుమ్మలగండి డ్యామ్ నిర్మాణానికి కదలిక రావడంతో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తీసుకెళ్లడంతో నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. దీంతో రైతన్నలు సంబర పడుతున్నారు. దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం వద్ద ఎర్రకాలువపై తుమ్మలగండి డ్యామ్‌ను బ్రిటీష్ కాలంలో నిర్మించారు. ఇది వరదలకు కొట్టుకుపోవడంతో ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. డ్యామ్ నిర్మాణానికి అంచనాలు తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఇవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. సుమారు 400 మీటర్ల పొడవు ఉన్న డ్యామ్ వరదలకు కొట్టుకుపోవడంతో ఆయకట్టు పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. డ్యామ్ ద్వారా దేవరపల్లి, తాడేపల్లిగూడెం మండలాల్లోని నాలుగు గ్రామాలకు చెందిన పంట పొలాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. వర్షాకాలంలో కొగువారిగూడెం రిజర్వాయర్ నుంచి జంగారెడ్డిగూడెం, నల్లజర్ల మండలాల మీదుగా ఎర్రకాలువకు సుమారు 22 వేల క్యూసెక్కుల నీరు వస్తుంది. తుమ్మలగండి వద్ద డ్యామ్ నుంచి ఎగువన సుందరరామయ్య కాలువ ద్వారా ఎర్రకాలువ నీరు త్యాజంపూడిలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణం గల ఆవ చెరువులోకి వెళ్తుంది. దీనిద్వారా ఆవ చెరువు కింద సుమారు 1,734 ఎకరాలు, కాలువ ఆయకట్టు 791 ఎకరాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే 2019 అక్టోబర్‌లో వచ్చిన వరదలకు ఎర్రకాలువ ఉధృతికి తుమ్మలగండి డ్యామ్ కుప్పకూలింది. దీనివల్ల ఎగువన సుందరరామయ్య కాలువకు సాగునీటి సరఫరా ఆగిపోయింది. అప్పటి నుంచి కాలువ, ఆవ చెరువు ఆయకట్టు పొలాలకు సాగునీటి సమస్య ఏర్పడింది. కొట్టుకుపోయిన డ్యామ్‌ను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు 2019 అక్టోబర్ 15న పరిశీలించారు. డ్యామ్ నిర్మాణానికి మొదటి విడతలో రూ.6 కోట్లు, తాత్కాలిక మరమ్మతులకు రూ.24 లక్షలతో అంచనాలు తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

దీనితో పాటు అనంతపల్లి నుంచి నందమూరు అక్విడెట్ వరకూ 33 కిలోమీటర్ల ఎర్రకాలువ గట్టు పటిష్టం చేయడానికి, స్ట్రక్చర్ నిర్మాణానికి అధికారులు రూ.40 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

నిధుల మంజూరుకు వినతి



తుమ్మలగండి వద్ద డ్యామ్ కూలిపోవడంతో నాలుగేళ్లుగా ఆయకట్టు పొలాలకు సాగునీరు అందడం లేదు. సుమారు 2,500 ఎకరాలు ఆయకట్టు భూములు ఉన్నాయి. ఎర్రకాలువ నీటితో ఆవ చెరువును నింపితే రెండు పంటలు పండేవి. డ్యామ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఇటీవల పోలవరంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును కలసి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం ఇచ్చారు.

–పల్లి వెంకటరత్నారెడ్డి, రైతు, త్యాజంపూడి

ప్రభుత్వ పరిశీలనలో ప్రతిపాదనలు



కొత్త డ్యామ్ నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశాం. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించాం. నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. డ్యామ్ నిర్మాణానికి సుమారు రూ.10 కోట్లు అవుతుంది. మరోసారి సీఎం జగన్, మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తాను.

–తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

వచ్చే ఎన్నికల్లోనూ జగనే సీఎం



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

గోపాలపురం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధిస్తారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గురువారం వేళ్లచింతలగూడెంలో మాల మహానాడు కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలసి వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేవన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు చంద్రబాబు కోల్పోయారన్నారు. చంద్రబాబు కుమారుడు నారా లోకేష్ దళితులు ఏం పీకుతారని మాట్లాడడం చూస్తుంటే ఎస్సీలంటే టీడీపీకి ఎంత అభిమానం ఉందో అర్థమవుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి వైపే దళితులంతా ఉన్నారని అన్నారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ విజయాన్ని ఎవరూ ఆపలేరని మంగరాజు అన్నారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు కె.బాలకృష్ణ, బి.బంగారమ్మ, సీహెచ్ రామచంద్రం, గోపి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



దేవరపల్లిలో లబ్ధిదారులకు ఎంజాయ్‌మెంట్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. బందపురం గ్రామానికి చెందిన 35 మంది మహిళా లబ్ధిదారులకు గురువారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఇళ్ల స్థలాల ఎంజాయ్‌మెంట్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు గృహాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. బందపురంలో గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టాలు ఇవ్వలేదన్నారు. లబ్ధిదారులందరికీ ఎంజాయ్‌మెంట్లు అందజేసి, గృహాలను మంజూరు చేశామన్నారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సొంటి కాశీవిశ్వనాథం, పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకర గంగరాజు, సుంకర రాంబాబు, దేవరపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్ పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ యంత్రసేవా పథకంలో బందపురం గ్రామానికి చెందిన రైతు బాలం రామకృష్ణకు మంజూరైన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే వెంకట్రావు అందజేశారు. ట్రాక్టర్ ఖరీదు రూ.10 లక్షలు కాగా 40 శాతం రాయితీపై ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు అందజేస్తుందని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం..



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖ డీఆర్వో శ్రీనివాసరావు

నల్లజర్ల: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తామని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుతామని గ్రామస్తులతో అటవీ శాఖ డీఆర్వో సీహెచ్ శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. గురువారం పోతవరం పంచాయతీ కార్యాలయం వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ (పర్యావరణ హిత జీవనం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతిని జీవ వైవిధ్యానికి హాని కలుగుతుందన్నారు. అడవులు, జీవరాసులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ప్రధాన రహదారుల్లో ప్లాస్టిక్ బ్యాగులను తొలగించే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, గ్రామ కార్యదర్శి జొన్నకూటి గణేష్, సహాయకుడు బషీర్, బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన



ముక్కామలలో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి శేఖర్‌బాబు



నిడదవోలులో బొమ్మలు వేస్తున్న విద్యార్థులు

పెరవలి: గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన సాధ్యమవుతుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. ముక్కామల శాఖా గ్రంథాలయంలో ఆయన గురువారం వార్షిక తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 74 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయని, వీటిలో ఇప్పటికే కంప్యూటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తణుకులో గ్రేడ్–1 గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.1.03 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. గ్రంథాలయాల్లో మరిన్ని సౌకర్యాలకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో పుస్తక నిక్షిప్త కేంద్రాలు 89 ఉన్నాయని, ఇవి మరిన్ని పెంచటానికి చర్యలు చేపడతామని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. వేసవి శిక్షణలో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన పతకాలు అందించి అభినందించారు. ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, ప్రసాద్, యోగా గురువు కరుటూరి విశ్వనాథం, సలాది సూర్యనారాయణ, రిసోర్స్‌పర్సన్ ఎ.దుర్గాభవాని, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

నిడదవోలు: స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్‌ఎం భీమారావు, గ్రంథాలయాధికారి కుంచే చినబాబు, రచయిత వేదుల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయండి



కాటకోటేశ్వరంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

నిడదవోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. కాటకోటేశ్వరంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలతో పాటు మండల పరిషత్, జెడ్పీ నిధులతో చేపట్టిన పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయితే బిల్లులు సక్రమంగా అందేలా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని చెప్పారు. పనుల పురోగతిపై పీఆర్ ఏఈ సీహెచ్‌ఎస్ఆర్‌కే శాస్త్రితో చర్చించారు. ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, వైఎస్సార్ సీపీ నాయకులు కోసూరి అప్పారావు, తిరుమళ్ల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న సీతారామాంజనేయ చౌదరి దంపతులు

ద్వారకాతిరుమల: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తమ వంతు కృషి చేస్తున్నట్టు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి తెలిపారు. తపన ఫౌండేషన్ ద్వారా అందించిన వాటర్ ట్యాంకర్‌ను గురువారం ఆయన స్థానిక వసంత్‌నగర్ కాలనీలో తన భార్య రేణుకతో కలసి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులకు మంచినీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి తలెత్తిన ప్రాంతాలకు ఈ ట్యాంకర్‌ను వినియోగించాలని అన్నారు. గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత దంపతులు, కె.గోపి విజ్ఞప్తి మేరకు ఈ ట్యాంకర్‌ను అందించినట్టు చెప్పారు. ఏలూరు జిల్లాలో తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకూ అందించిన 20కి పైగా వాటర్ ట్యాంకర్లు ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయన్నారు. తొలుత దాత దంపతులు చినవెంకన్న ఆలయాన్ని సందర్శించారు. వీరిని సర్పంచ్ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో నిడమర్తి సత్యకుమార్, మైలు వానివాసు, పాకలపాటి మంగతాయారు, మెట్టపల్లి బుజ్జి పాల్గొన్నారు.

24న కొవ్వూరుకు సీఎం జగన్

- జగనన్న విద్యా దీవెన కార్యక్రమం ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన నేతలు, అధికారులు

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో ఈ నెల 24వ తేదీన నిర్వహించే జగనన్న విద్యా దీవెన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనున్నారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఈ విషయం తెలిపారు. సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణకు అనువైన వివిధ స్థలాలను గురువారం ఆమె పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పార్కింగ్‌కు అనువైన స్థలాలను చూడాలని కలెక్టర్ మాధవీలత సూచించారు. సీఎం పర్యటనకు గడువు సమీపిస్తున్నందున అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పని చేసి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి రోడ్డు షో నిర్వహించే మార్గాన్ని పరిశీలించారు. అంతకు ముందు ఆర్‌డీఓ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి, ఇతర జిల్లా అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ తాడి విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, మంత్రి వనిత, ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు

ముంజెంత చలవో



తాళ్లపూడిలో విక్రయానికి సిద్ధం చేసిన తాటి ముంజెలు

తాళ్లపూడి: వేసవి వచ్చిందంటే చాలు తాటి ముంజెలకు ఎనలేని గిరాకీ ఉంటోంది. వీటిని తినడం వల్ల శరీరం చల్లబడుతుంది. అంతే కాకుండా లేత ముంజెలు తినటం వల్ల తొందరగా జీర్ణమవుతాయి. నియోజకవర్గంలో సుమారు 50 కుటుంబాలకు పైగా తాటి ముంజెల వ్యాపారం సాగిస్తున్నాయి. తాడిచెట్టు నుంచి ముంజె కాయలు కోసి వాటిని రోడ్డు పక్కకు చేర్చి ముంజెలుగా తీసి విక్రయిస్తుంటారు. డజను ముంజెలు రూ.50కు విక్రయిస్తున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు వంటి దూర ప్రాంతాలకు ముంజె కాయలు తరలించి విక్రయిస్తున్నామని వ్యాపారులు తెలియజేస్తున్నారు. రోజువారీ సంపాదన రూ.300 నుంచి రూ.400 వరకూ ఉంటుందన్నారు.

వాహన తనిఖీలు

చాగల్లు: మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చాగల్లు ఎస్సై సీహెచ్ రమేష్ తెలిపారు. చాగల్లులో గురువారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వారిపై 20 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా బాలస్వామి



నల్లజర్ల: మండల ప్రత్యేకాధికారిగా రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ బి.బాలస్వామి నియమితులయ్యారు. గురువారం ఆయన నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నల్లజర్ల గ్రామ సచివాలయంలో కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ నెల 23 నుంచి జూన్ 5న పర్యావరణ దినోత్సవం వరకూ అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన మిషన్ లైఫ్ (పర్యావరణ హిత జీవనం) కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 24న కొవ్వూరులో జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు సంబంధించిన వివిధ అంశాలపై మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ జోగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ శివ, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ ఉన్నారు.

పురస్కారాలకు వలంటీర్ల ఎంపిక

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా వలంటీర్లకు అందిస్తున్న పురస్కారాలకు నిడదవోలు మండలంలోని 22 సచివాలయాల పరిధిలో 306 మంది ఎంపికైనట్లు ఎంపీడీఓ టి.మూర్తిబాబు గురువారం తెలిపారు. సేవా వజ్ర పురస్కారానికి కోరుమామిడి గ్రామానికి చెందిన వలంటీర్ జొన్నకూటి కవిత, సేవారత్న పురస్కారానికి ఐదుగురు, సేవా మిత్ర పురస్కారాలకు 300 మంది వలంటీర్లు ఎంపికైనట్లు ఆయన చెప్పారు.

ఉండ్రాజవరం: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన గ్రామ, వార్డు వలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవం 20వ తేదీ నుంచి జరుగుతుందని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు గురువారం తెలిపారు. 20న వెలగదుర్రు, మోర్త–1, 2 సచివాలయాల్లో, 22న వడ్లూరు, సత్యవాడ, 23న పసలపూడి, సూర్యారావుపాలెంలో, 29న ఉండ్రాజవరం 1, 2, 3, తాడిపర్రు సచివాలయాల్లో, 30న పాలంగి, కె.సావరం, 31న వేలివెన్ను 1, 2, 3, కాల్దారీ, జూన్ 1న చివటం, దమ్మెన్ను గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తారని తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలో బాలిక(15)కు గురువారం వివాహ నిశ్చితార్థం చేస్తున్నట్లు సమాచారం తెలుసుకుని అధికారులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి మైనారిటీ తీరేంత వరకూ వివాహం చేయమని రాత పూర్వకంగా హామీ పత్రం తీసుకున్నారు. వీఆర్వో ఎస్.దుర్గారావు, డబ్ల్యూజీఎంఎస్‌కే దీపిక ప్రియాంకలు యువతి తల్లిదండ్రులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు తెలియజేశారు.

పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

చాగల్లు: బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధరదేవి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్ సంబంధించి రికార్డులు పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య రీత్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ నిషిత, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి పుష్కర బ్రహ్మోత్సవాలు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి పుష్కర బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకుడు శ్రీమన్నారాయణస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తయ్యి, 13వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకూ మూడు రోజులు ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు. 20న విష్ణు సహస్రనామ పారాయణ, 21న సామూహిక సహస్రనామ కుంకుమార్చన, 22న నిత్యవిధి, 23న శ్రీపుష్ప యాగం జరుగుతాయన్నారు.

వ్యవసాయ కళాశాల డీన్ నాయక్‌కు సత్కారం

కంబాలచెరువు: వ్యవసాయ కళాశాల నూతన భవనాలను కాతేరులోని వ్యవసాయక్షేత్రంలో నిర్మించడానికి కృషి చేసిన అగ్రికల్చరల్ కాలేజీ రాజమండ్రి అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్ రాజ్‌నాయక్‌ను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నాయకుడు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్యామరాజ్ నాయక్ మాట్లాడుతూ అన్నపూర్ణగా గుర్తింపు పొందిన ఉభయగోదావరి జిల్లాలకు వ్యవసాయ కళాశాల ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, ఎన్.వెంకట రామయ్య, తాళ్లూరి రవిరాయల్, పులుమాటి బాబూరావు, ఉసురుమర్తి రామారావు, పులిదుండి ఆనందకుమార్ పాల్గొన్నారు.